సాక్షి
వనపర్తి
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



ఈసీ నిఘా
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల తీరుపై ఈసీ ప్రత్యేక నిఘా ఉంచింది.
వివరాలు 10లో ▸



ఆలయాల మూసివేత
చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయాలను మూసివేశారు.
వివరాలు 12లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.2 /23.1
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత. అర్ధరాత్రి కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీసుల కవాతు



పాన్‌గల్: ప్రజలు ప్రశాంత **వాతావరణంలో** తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ వేణు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్పీ ఆదేశానుసారం పోలీసు కవాతు నిర్వహించినట్లు వివరించారు. గ్రామాల్లో గొడవలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

పెబ్బేరులో..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో శనివారం సీఏఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. బస్టాండు నుంచి చెలిమిల్ల వరకు రోడ్డు వెంట కవాతు కొనసాగింది. కార్యక్రమంలో కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వనపర్తి: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా జిల్లాకేంద్రంలో ప్రారంభమైన పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నారు. మూడో బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఇంజినీర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని ఒక ప్రకటనలో కోరారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

వనపర్తి: అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆదివారం నియోజకవర్గంలోని తన అనుచరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని శనివారం మేఘారెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసింది.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరునికి భక్తులు శాస్త్రోక్తంగా శనివారం తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథశాస్త్రి భక్తులతో జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరునికి తిలతైలాభిషేక పూజలు, గోత్ర నామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సోనామసూరి క్వింటా రూ.2,139

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,139, కనిష్ఠంగా రూ.1,700 వరకు ధరలు లభించాయి. హంస ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,941, కనిష్ఠంగా రూ.1,809 ధరలు నమోదయ్యాయి. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

తిరుగుబావుటా..!

కాంగ్రెస్‌లో భగ్గుమంటున్న అసమ్మతి సెగలు



- టికెట్లు దక్కని ఆశావహుల నిరసన గళం
- పార్టీని వీడే యోచనలో సీనియర్ నేత నాగం
- జడ్చర్లలో రెబల్ అభ్యర్థిగా ఎర్ర శేఖర్.. వనపర్తిలో మేఘారెడ్డి సైతం..
- దేవరకద్రలో 'హస్తం' పెద్దలపై కాటం,కొండా ఆగ్రహం
- మహబూబ్‌నగర్, మక్తల్‌లో గుంభనంగా వాతావరణం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్‌ను రెబల్స్ బెడద పీడిస్తోంది. అభ్యర్థిత్వాల ఖరారు తర్వాత పలు నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు రాజుకున్నాయి. టికెట్ ఆశించి భంగపడిన నేతలు నిరసన గళం వినిపిస్తూ.. తిరుగుబావుటా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. తమతమ అనుచరులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నం కావడంతో పాటు తమతో కలిసి వచ్చే ముఖ్య నాయకులతో మంతనాలు మొదలుపెట్టారు. కొందరు స్వతంత్రంగా పోటీ చేసేందుకు సమాయత్తం అవుతుండగా.. మరికొందరు వేరే పార్టీల్లో చేరి బరిలో నిలిచే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నాగర్‌కర్నూల్‌లో సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

జంగ్ తెలంగాణ

8 సెగ్మెంట్లలో లుకలుకలు..

ఉమ్మడి పాలమూరులోని 14 శాసనసభ నియోజకవర్గ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. తొలుత ఎనిమిది మందిని ఖరారు చేస్తూ ఈ నెల 14న మొదటి జాబితా.. ఆ తర్వాత ఆరుగురితో శుక్రవారం రెండో జాబితా విడుదల చేసింది. అచ్చంపేట, అలంపూర్ , షాద్‌నగర్, కొడంగల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారులో ఎలాంటి ఇబ్బందులు లేవు. నారాయణపేటలో కుంభం శివకుమార్‌రెడ్డి టికెట్ ఆశించినా.. పలు కారణాలతో ఆయనకు ఇవ్వలేదు. కానీ శివకుమార్‌రెడ్డి సూచించిన మేరకు ఆయన మేనకోడలు చిట్టెం పర్ణికారెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో అక్కడ సమస్య సద్దుమణిగింది. ఇక మిగిలిన ఎనిమిది సెగ్మెంట్లకు (జడ్చర్ల, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్, మక్తల్) సంబంధించి హస్తం అభ్యర్థిత్వాల ఖరారు అగ్గి రాజుకునేలా చేసింది.

నాగం.. కారెక్కుతారా..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన నాగం జనార్దన్‌రెడ్డికి భంగపాటు ఎదురైన విషయం తెలిసిందే. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డికే పార్టీ అధిష్టానం టికెట్ ఖరారు చేయడంతో పార్టీ పెద్దల తీరుపై ఆయన ఆగ్రహంతో ఉన్నారు. జానారెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే వంటి పెద్దలు బుజ్జగింపులు చేసినా.. పునరాలోచన చేయాలని, తనకే టికెట్ ఇవ్వాలని పట్టుబడుతూ వస్తున్నారు. రెండో విడతలో ఉమ్మడి జిల్లాలో మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఎలాంటి మార్పులు ఉండవని గ్రహించిన ఆయన కాంగ్రెస్‌ను వీడేందుకే సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనతో ఏకీభవించి నాగం కారెక్కుతారా, లేక తన దారి తాను చూసుకుంటారా అన్నది ఉత్కంఠగా మారింది.

కొల్లాపూర్, గద్వాల సైలెంట్ వార్..

మహబూబ్‌నగర్‌లో డీసీసీ మాజీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ మైనార్టీ కోటాలో తనకు టికెట్ వస్తుందని ఆశించారు. టీపీసీసీ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ సైతం నమ్మకం పెట్టుకున్నారు. కానీ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ ఖరారు కావడంతో వారు అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు వారిని బుజ్జగించేందుకు యెన్నం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక కొల్లాపూర్‌లో కాంగ్రెస్ టికెట్ ఆశించిన చింతలపల్లి జగదీశ్వర్‌రావును కాదని పార్టీలో చేరిన జూపల్లికి తొలి జాబితాలోనే టికెట్ ఖరారైన విషయం తెలిసిందే. దీంతో చింతలపల్లి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరి బీఫాం అందుకున్నారు. అయితే హస్తం పెద్దల బుజ్జగింపుతో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. గద్వాలలో సైతం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్యకే పోటీ చేసే అవకాశం కల్పించారు. ఈ రెండు స్థానాల్లో అసమ్మతుల బెడద ఉండగా.. ప్రస్తుతానికి గుంభనంగా ఉన్నారు. వారు, వారి అనుచరులు ఎంత మేర అభ్యర్థులకు సహకరిస్తారనేది వేచిచూడాల్సిందే.



దేవరకద్రలో కొండా, కాటం..

దేవరకద్ర నియోజకవర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి (జీఎమ్మార్)తో పాటు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, కొండా ప్రశాంత్ రెడ్డి టికెట్ ఆశించారు. జీఎమ్మార్‌కే టికెట్ దక్కడంతో వారు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శనివారం ఇద్దరు కలిసి తమతమ ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో భేటీ అయిన వారు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టికెట్‌పై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ 'హస్తం' పెద్దలపై విమర్శలు ఎక్కుపెట్టారు. మక్తల్‌లో నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరితో పాటు బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి టికెట్ ఆశించారు. శ్రీహరికే ఖరారు కాగా మిగిలివారు అసంతృప్తిలో ఉన్నారు.

బరిలోనే ఎర్రశేఖర్, మేఘారెడ్డి..

జడ్చర్ల లేదా నారాయణపేటలో ఏదో ఒక చోటు నుంచి తనకు టికెట్ వస్తుందనే ధీమాతో ఉన్న ఎర్రశేఖర్‌కు భంగపాటు ఎదురు కాగా.. రెబల్‌గా బరిలో నిలిచేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. శనివారం జడ్చర్లలోని తన స్వగృహంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ నవంబర్ 9న నామినేషన్ వేయనున్నట్లు వెల్లడించారు. బీజేపీ నుంచి పోటీ చేయాలని శేఖర్‌పై అనుచరులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. వనపర్తిలో మాజీమంత్రి చిన్నారెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కాగా.. టికెట్‌పై ఆశలు పెట్టుకుని పార్టీలో చేరిన మేఘారెడ్డి తన అనుచరుల ఒత్తిళ్ల మేరకు బరిలో నిలిచేందుకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లితో కలిసి ఆయన కాంగ్రెస్‌లో చేరగా.. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో పొంగులేటిని కలిసి చర్చించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



జడ్చర్లలోని తన నివాసానికి వచ్చిన మద్దతుదారులతో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

నామినేషన్ల స్వీకరణపై పూర్తి అవగాహన





సమావేశానికి హాజరైన ఏఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలు.. మాట్లాడుతున్న ఆర్‌ఓ ఎస్.తిరుపతిరావు

- రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ, పరిశీలనపై పూర్తి అవగాహన కలిగి ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు తెలిపారు. శనివారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం తరుపున మాస్టర్ ట్రైనర్లు ఆన్‌లైన్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అభ్యర్థులు నామినేషన్ ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దాఖలు చేస్తారని.. వాటిని ఎలా తీసుకోవాలి.. పరిశీలన ఎలా చేయాలో వివరించారు. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ఆర్‌ఓల సందేహాలను మాస్టర్ ట్రైనీలు నివృత్తి చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సర్వే చేసుకున్నట్లు తెలిపారు. ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి జాకీర్ హుస్సేన్, ఎన్నికల సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రతి మండల కేంద్రంలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆర్‌ఓ ఎస్.తిరుపతిరావు అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లో సహాయ రిటర్నింగ్ అధికారులు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షాలో పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో 5 మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగుల పోలింగ్ కేంద్రం, ఒకటి యువత పోలింగ్ కేంద్రం, మండలానికి ఒకటి చొప్పున ఏడు మండలాల్లో ఒక్కో ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

అవార్డుల సాధన అలవాటుగా మార్చుకోవాలి



కల్వకుర్తి రూరల్: ప్రతి కార్మికుడు, ఉద్యోగి అవార్డుల సాధనను అలవాటుగా మార్చుకోవాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ కోరారు. శనివారం కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో ఉమ్మడి జిల్లాలోని 10 డిపోల పరిధిలో అవార్డులు సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం అందజేసి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి ఒక్కరికి కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉంటుందని.. 9వ స్థానంలోని మహబూబ్‌నగర్ రీజియన్‌ను మొదటి స్థానంలోకి తీసుకురావడంలో కార్మికుల కృషి అమూల్యమైందన్నారు. ఈ విధానాన్ని ఇలాగే కొనసాగించి ఎల్లప్పుడు మొదటిస్థానంలో ఉండేలా పనిచేయాలని కోరారు. కల్వకుర్తి డిపో రూ.2.50 కోట్ల నష్టాన్ని అధిగమించడం అభినందనీయమని కొనియాడారు. రీజినల్ మేనేజర్ శ్రీదేవి, ఆర్‌ఎంఎం శైలజ, కల్వకుర్తి డిపో మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఉత్తమ సేవలు..

స్టేషన్ మహబూబ్‌నగర్: రీజియన్‌లోని ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో నాన్‌స్టాప్ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డీలక్స్ లాంజ్‌ను, ప్లాట్‌ఫాంలు, పలు స్టాళ్లను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పండుగ రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు నడిపినట్లు వివరించారు. ఈడీని పలువురు ఉద్యోగులతో పాటు ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, అజీమోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సత్కరించారు.

ఆదరిస్తే.. అండగా ఉంటా : బీజేపీ

వీపనగండ్ల: తనను ఆదరించి భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని కొల్లాపూర్ బీజేపీ అభ్యర్థి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్‌కు జాతీయ రహదారి, సోమశిల– సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు కేంద్రాన్ని ఒప్పించి తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాలన కొనసాగుతోందని.. ప్రజల పాలన రావాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధానకార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, ప్రధానకార్యదర్శి నారాయణ, నాయకులు కృష్ణయ్య, బాలకృష్ణ, నాగేంద్రం, వీరబాబు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు

పంటలు ఎండుతున్నాయి.. సాగునీరు ఇవ్వండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూర్: చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని.. వెంటనే సాగునీరు విడుదల చేయాలని సీపీఎం జిల్లాకార్యదర్శి జబ్బార్, రాష్ట్రనాయకుడు మహమూద్ కోరారు. శనివారం మండలంలోని రేచింతల రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అలాగే తూంపల్లి రైతులు సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీజేపీ అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారిందని.. నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వలకు గండ్లుపడి సాగునీరు వృథా అవుతోందని.. గతంలోనూ చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వివరించారు. యాసంగి సీజన్‌లో సమస్యలను గుర్తించక పోవడంతోనే ప్రతి ఏటా వానాకాలంలో కాల్వలకు గండ్లు పడుతున్నాయని.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అసహనం వ్యక్తం చేశారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాల్వకు అనుసంధానంగా నిర్మించిన డి–6 కాల్వ కింద జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపురం, రేచింతల గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని.. వారబందీతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీఎస్ గోపి, రాజు, బాలరాజు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌లోకి వలసలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావటం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి, ఫార్మల్ నేషనల్ బాక్సర్ ప్రతాప్‌రెడ్డి పార్టీలో చేరగా మంత్రి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు పూర్తి విశ్వాసంతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, దీంతోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, నాయకులు అశోక్, బీచుపల్లి పాల్గొన్నారు.

'మేఘారెడ్డికే అవకాశం ఇవ్వాలి'

వనపర్తిటౌన్: వనపర్తి బరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్నారెడ్డి తప్పుకుంటే ఆయనకు పాదాభివందనం చేసి కృతజ్ఞతలు తెలుపుతామని మేఘారెడ్డి మద్దతుదారులు, డీసీసీ మాజీ అధ్యక్షుడు తైలం శంకర్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు బి.వెంకటేష్, బ్రహ్మం, నాయకులు శంకర్‌నాయక్, రామకృష్ణారావు, వాల్యానాయక్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వనపర్తిలో కాంగ్రెస్‌పార్టీని బతికించి, గెలిచే అభ్యర్థికి టికెట్ ఇచ్చేలా చిన్నారెడ్డి చొరవ చూపాలని.. గౌరవంగా తప్పుకోకుంటే తిరుగుబాటు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని.. జాబితాలో చివరి దాకా మేఘారెడ్డి పేరు ఉంచి అప్పటికప్పుడు చిన్నారెడ్డి పేరు చేర్చారని వివరించారు. మేఘారెడ్డితో పాటు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు భారీగా కాంగ్రెస్‌లో చేరారని.. ప్రస్తుతం వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా సమయం మించిపోలేదని.. మేఘారెడ్డికి టికెట్ కేటాయించి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బతికించాలని కోరారు. కార్యక్రమంలో రవికిరణ్, నరేందర్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


మేఘారెడ్డికే టికెట్ ఇవ్వాలి..

గోపాల్‌పేట: అన్ని సర్వేల్లో ముందున్న మేఘారెడ్డికి టికెట్ ఇవ్వకుండా చిన్నారెడ్డికి కేటాయించడం ఏమిటని మేఘారెడ్డి వర్గం ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నారెడ్డికి టికెట్ ఇవ్వడం ప్రజలకు ఇష్టం లేదని.. కేవలం అధిష్టానం సిఫారస్‌తో చివరి నిమిషంలో టికెట్ తీసుకున్నారని ఆరోపించారు. మేఘారెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆదివారం జిల్లాకేంద్రంలో భారీ సభ నిర్వహిస్తున్నామని.. కార్యకర్తలు వేలసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యశీలారెడ్డి, శివన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం

కొత్తకోట: సమష్టి కృషితోనే విజయం సాధ్యమతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. దేవరకద్ర ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పాత, కొత్త తేడా లేకుండా పనిచేయాలన్నారు. 9 ఏళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, కేసీఆర్ పాలనలో లబ్ధి పొందిన ప్రతి కుటుంబాన్ని కార్యకర్తలు, నాయకులు కలవాలని సూచించారు. అంతకుముందు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిబద్ధతతో ఉన్న వ్యక్తి రావుల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడం రెండు నియోజవర్గాల్లోని కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, భీంరెడ్డి, గాడీల ప్రశాంత్, సాక బాలనారాయణ, కొండారెడ్డి, కె.శ్రీనివాస్‌జీ, బాబురెడ్డి, జగన్‌రెడ్డి, రాములుయాదవ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి సార్వత్రిక ఎన్నికల్లో దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని దంతనూరులో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ పాలనలో జరిగిందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో వచ్చే నాయకుల మాటలు నమ్మొద్దని, సంక్షేమ పథకాలు రావాలంటే బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా ముందుకు.. : కాంగ్రెస్

అమరచింత: మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మక్తల్ అభ్యర్థిగా వాకిటి శ్రీహరిని అధిష్టానం ఖరారు చేయడం సంతోషకరమని.. 38 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తూ ఇక్కడి ప్రజలకు సుపరిచితుడిగా ఉన్న శ్రీహరిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మరోమారు ఆగం చేయడానికి సీఎం కేసీఆర్ కుటిల మేనిఫెస్టోను సృష్టించారని.. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, నాయకులు పోసిరిగారి విష్ణు, తులసీరాజ్, హన్మంతునాయక్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

పార్టీలో చేరికలు..

టీపీసీసీ కల్లుగీత విభాగం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ సమక్షంలో వైఎస్‌ఆర్‌టీపీ మైనార్టీ విభాగం జిల్లా కన్వీనర్ దుబాయ్ మైనుద్దీన్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థిగా వాకిటి శ్రీహరిని ప్రకటించడంతో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు.


పాలమూరు మినిస్టార్లు

ఉమ్మడి జిల్లా నుంచి 16 మందికి మంత్రి యోగం

- అలంపూర్, కొడంగల్‌కు ఒక్కసారి కూడా దక్కని భాగ్యం
- అత్యధికంగా మహబూబ్‌నగర్ నుంచి ముగ్గురికి అవకాశం
- తెలంగాణ ఏర్పడిన తర్వాత ముగ్గురికి చోటు

శాసనసభ్యుడిగా గెలిచినా మంత్రిగా పనిచేసే అవకాశం అందరికీ దక్కదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల్లో రాణించి.. కుల, మత, రాజకీయ సమీకరణాలను బేరీజు వేసుకుంటూ ఇప్పటివరకు 16 మంది రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవులు దక్కించుకున్నారు. ఇందులో నాగం జనార్దన్‌రెడ్డి, మహేంద్రనాథ్ అత్యధిక కాలం మంత్రులుగా పనిచేశారు. ఉమ్మడి పాలమూరు నుంచి డీకే అరుణ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న మొదటి మహిళగా రికార్డు సృష్టించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పి.శంకర్‌రావు షాద్‌నగర్ నుంచి 1983, 1989, 1999, 2004, కంటోన్మెంట్ నుంచి 2009లో ఎమ్మెల్యేగా గెలిచారు. చిన్ననీటి పారుదల, జౌళి శాఖ మంత్రిగా పని చేశారు. కాగా.. ఉమ్మడి జిల్లాలోని అలంపూర్, కొడంగల్ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు మంత్రిగా అవకాశం దక్కలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంత్రులుగా పనిచేసిన వారిపై కథనం..

– సాక్షి మహబూబ్‌నగర్ డెస్క్



నాగం జనార్దన్‌రెడ్డి - నాగర్‌కర్నూల్

ఎమ్మెల్యేగా.. 1985, 1994, 1999, 2004, 2009, 2012



డాక్టర్‌గా సేవలు అందించిన నాగం జనార్దన్‌రెడ్డి ఎన్‌టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి వి.నారాయణగౌడ్ చేతిలో స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1994, 1999, 2004,2009, 2012లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1995లో చంద్రబాబు కేబినెట్‌లో తొలిసారిగా మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. మద్యనిషేధం, అటవీ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు.

పుట్టపాగ మహేంద్రనాథ్ - నాగర్‌కర్నూల్/అచ్చంపేట

ఎమ్మెల్యేగా.. 1962, 1967, 1972, 1983, 1985



1957లో నాగర్‌కర్నూల్ ద్విసభ నియోజకవర్గంలో ఎస్సీ రిజర్వ్ స్థానం నుంచి మహేంద్రనాథ్ తొలిసారిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పుడు రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1962లో నాగర్‌కర్నూల్ నుంచి గెలిచిన ఆయన.. అచ్చంపేట ఎస్సీ నియోజకవర్గంగా మారిన తర్వాత 1967, 1972లో అక్కడి నుంచి పోటీ చేసి నెగ్గారు. ఆ తర్వాత టీడీపీలో చేరి 1983, 1985లో విజయం సాధించారు. ఎన్‌టీఆర్ మంత్రివర్గంలో ఆర్థికశాఖ బాధ్యతలు నిర్వర్తించారు.

పోతుగంటి రాములు - అచ్చంపేట

ఎమ్మెల్యేగా.. 1994, 1999, 2009



సిద్దిపేటలో వ్యవసాయ మార్కెట్ గ్రేట్–1 కార్యదర్శిగా పనిచేస్తున్న రాములు ఉద్యోగానికి రాజీనామా చేసి 1994లో టీడీపీలో చేరారు. అదే ఏడాది తొలిసారిగా అచ్చంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో రెండోసారి గెలిచి చంద్రబాబు కేబినెట్‌లో క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2009లో మూడోసారి ఎమ్మెల్యేగా, 2019లో నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు.

డీకే సమరసింహారెడ్డి - గద్వాల

ఎమ్మెల్యేగా.. 1979, 1983, 1989,



గద్వాల ఎమ్మెల్యే డీకే సత్యారెడ్డి మరణంతో తర్వాత ఆయన తనయుడు డీకే సమరసింహారెడ్డి 1979లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ఎన్‌టీఆర్ ప్రభంజనంలోనూ ఆయన 1983లో రెండోసారి గెలిచారు. 1989లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకున్న ఆయన మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, న్యాయశాఖల మంత్రిగా పనిచేశారు.

పొడపాటి చంద్రశేఖర్ - మహబూబ్‌నగర్

ఎమ్మెల్యేగా.. 1983, 1985, 1994, 1999



1983లో టీడీపీతో రాజకీయ ఆరంగేట్రం చేసిన ఆయన అదే ఏడాది మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1985, 1994, 1999లో.. మొత్తం నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రబాబు కేబినెట్‌లో న్యాయ, పర్యాటక, రవాణా శాఖల మంత్రిగా పనిచేశారు.

సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి - వనపర్తి

ఎమ్మెల్యేగా.. 2018



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖాదీ బోర్డు చైర్మన్‌గా పనిచేసిన ఆయన 2001లో రాష్ట్రసాధనకోసం టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2004లో కొల్లాపూర్ నుంచి 2014లో వనపర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. సీఎం కేసీఆర్ ఆయనకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. 2018లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన నిరంజన్‌రెడ్డి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయం, సహకార, ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

వి.శ్రీనివాస్‌గౌడ్ - మహబూబ్‌నగర్

ఎమ్మెల్యేగా.. 2014, 2018



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా చేసిన శ్రీనివాస్‌గౌడ్ అంచెలంచెలుగా ఎదిగి తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగసంఘాల తరఫున పోరాడారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. పొలిటికల్ జేఏసీకి కోచైర్మన్‌గా ఉన్నారు. 2014లో ఉద్యోగానికి రాజీనామా చేసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2018లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఎక్సైజ్, క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రిగా పనిచేస్తున్నారు.

పులి వీరన్న - మహబూబ్‌నగర్

ఎమ్మెల్యేగా.. 1989, 2004



న్యాయశాస్త్రం చదివిన పులి వీరన్న 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. 1989లో తొలిసారిగా మహబూబ్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలపొంది చేనేత, జౌళిశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1994, 1999లో ఓడిపోయినా.. 2004లో కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో రెబల్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా రెండోసారి విజయం సాధించారు.

జూపల్లి కృష్ణారావు - కొల్లాపూర్

ఎమ్మెల్యేగా.. 1999, 2004, 2009, 2012, 2014



బ్యాంక్ ఉద్యోగిగా పనిచేసిన జూపల్లి కృష్ణారావు 1999లో కాంగ్రెస్‌లో చేరి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ నుంచి మరోసారి నెగ్గి.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. ఆహార, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రిగా, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ మంత్రివర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు.

డీకే అరుణ - గద్వాల

ఎమ్మెల్యేగా.. 2004, 2009, 2014



మక్తల్ మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి కుమార్తె అరుణ గద్వాల మాజీ ఎమ్మెల్యే సత్యారెడ్డి చిన్న కుమారుడు డీకే భరతసింహారెడ్డిని వివాహం చేసుకుంది. పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండు కుటుంబాలకు రాజకీయ నేపథ్యం ఉంది. మామ, భర్త గద్వాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తండ్రి, సోదరుడు మక్తల్ ఎమ్మెల్యేగావిజయం సాధించారు. కాగా.. డీకే అరుణ 2004లో సమాజ్‌వాదీ పార్టీ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలపొందింది. 2009లో కాంగ్రెస్ నుంచి రెండోసారి గెలిచి వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వంలో సమాచార, పౌరసరఫరాల, ఖాదీ, చిన్నతరహా, గ్రామీణ పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు.

చిత్తరంజన్‌దాస్ - కల్వకుర్తి

ఎమ్మెల్యేగా.. 1985, 1989



కాంగ్రెస్ పార్టీ నుంచి 1985లో రాజకీయ రంగప్రవేశం చేసిన చిత్తరంజన్‌దాస్ అదే ఏడాది కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావును 3,568 ఓట్ల తేడాతో ఓడించి సంచలనం సృష్టించారు. ఆ తర్వాత మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రి వర్గంలో కార్మిక, ఉపాధి కల్పన, టూరిజం, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

డాక్టర్ జి.చిన్నారెడ్డి - వనపర్తి

ఎమ్మెల్యేగా..1989, 1999, 2004, 2014



పీహెచ్‌డీ పూర్తి చేసిన చిన్నారెడ్డి 1984లో యువజన కాంగ్రెస్‌లో చేరారు. 1985లో టీడీపీ అభ్యర్థి బాలకృష్ణయ్య చేతిలో ఓడిపోయారు. 1989లో తొలిసారిగా వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1999, 2004లో విజయం సాధించారు. వైఎస్సార్ మంత్రి వర్గంలో 2007 నుంచి 2009 వరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు.

డాక్టర్ సి.లక్ష్మారెడ్డి - జడ్చర్ల


ఎమ్మెల్యేగా.. 2004, 2014, 2018



2001లో టీఆర్‌ఎస్ పార్టీలో చేరి స్వరాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 2004లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008లో కేసీఆర్ పిలుపు మేరకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో ఓడిపోయారు. తర్వాత 2014, 2018లో విజయం సాధించారు. 2014 నుంచి 2018 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు.

రాంచందర్‌రావు కల్యాణి - మక్తల్

ఎమ్మెల్యేగా.. 1962, 1967, 1972



నారాయణపేట మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన స్వాతంత్య్ర సమరయోధుడు రాంచందర్‌రావు తొలిసారిగా 1962 నుంచి మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1967 లోనూ గెలిచి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వంలో మార్కెటింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 1972లో మక్తల్ నుంచి ఏకగ్రీవంగా ఎమ్మెల్యే కావడంతో పాటు హ్యాట్రిక్ సాధించారు.

ఎల్కోటి ఎల్లారెడ్డి - మక్తల్/నారాయణపేట

ఎమ్మెల్యేగా.. 1994, 1999, 2009



వార్డు మెంబరుగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఎల్లారెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతూ సర్పంచ్‌గా, సమితి అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1994, 1999లో వరుసగా టీడీపీ తరఫున మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో నారాయణపేట నుంచి పోటీచేసి మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1997–99 కాలంలో చంద్రబాబు కేబినెట్‌లో మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

అవును నాది తప్పే..

- నేను అలా చేసి ఉండాల్సింది కాదు!
- విచారణలో పలు అంశాలను అంగీకరించిన ఆలయ ఉద్యోగి రంగనాథ్
- ముగిసిన అధికారుల విచారణ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయంలో రంగనాథ్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగపరమైన వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయ్యారు. ఆయన్ను దేవాదాయశాఖ సూపరింటెండెంట్ రఘునాథ్, పాలెం దేవస్థానం ఈఓ రంగారావు శనివారం విచారణ చేపట్టారు. ఆయనపై వచ్చిన ఆరోపణల విషయంలో సుమారు గంట పాటు ప్రశ్నించగా.. పలు అంశాలపై సమాధానం ఇచ్చారు. అవును నాది తప్పే.. నేను అలా చేసి ఉండాల్సింది కాదు.. అంటూ తన తప్పును అంగీకరించారు. అయితే తాను ఆర్థిక పరమైన లావాదేవీల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. భక్తుల విషయంలో, మతేతర వివాహ సంబంధం అంశంలో, భక్తులకు ఫోన్ చేసి వివాహ విషయంలో మాట్లాడటం, తలదూర్చడం తన తప్పేనని అంగీకరిస్తున్నట్టు తెలిపారు. అదే విషయాన్ని తాను రాతపూర్వకంగా రాసి కూడా ఇచ్చాని, ఇది మొదటి తప్పుగా భావించాలని కోరారు. ఆలయంలో ఇతర మతస్తులను పిలిచి దేవస్థానం కార్యాలయంలో ఏకాంతంగా ఎందుకు చర్చలు జరుపుతున్నావని ప్రశ్నించగా... అతను తన ఇంటి ముందున్న వ్యక్తులు కాబట్టి, నేను కార్యాలయంలో పర్సనల్‌గా కూర్చోబెట్టుకుని మాట్లాడాను అంటూ సమాధానం ఇచ్చారు. మతేతర వ్యక్తులకు రూ.లక్షలు ఇస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై తన అకౌంట్ నుంచి ఎలాంటి లావాదేవీలు జరగలేదని స్పష్టం చేశారు. దీంతో బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకొచ్చి సమర్పించాలని విచారణ అధికారులు రంగనాథ్‌ను కోరారు. అనంతరం రంగానాథ్ బాధిత భక్తులను పిలిపించి వారితో కూడా మాట్లాడారు. చివరిగా ఇద్దరితో స్టేట్‌మెంట్ తీసుకుని వాటిని దేవాదాయశాఖ కమిషనర్‌కు పంపిస్తామని వివరించారు.



రంగానాథ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్న అధికారులు

ఉద్యోగులపై ఈసీ నిఘా



- విధులకు పరిమితం కావాల్సిందే..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. అదే స్థాయిలో ఎన్నికల సంఘం అన్నింటిపై నిఘాను తీవ్రతరం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరించాలని భావిస్తోంది. ఎన్నికలు దగ్గర పడేకొద్దీ నిబంధనలు ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఉద్యోగులు విధుల వరకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా ఉండకూడదని ఎన్నికల సంఘం స్పష్టంగా సూచిస్తోంది. ఈ విషయాన్ని ఆయా విభాగాల ఉన్నతాధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తే కింది స్థాయి ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకునే వీలుంది.

వీడియో చిత్రీకరణ..

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు ప్రచార సభలు, సమావేశాల వీడియోలు చిత్రీకరిస్తున్నాయి. వీటిని ప్రత్యేక వ్యూయింగ్ బృందం చూస్తుంది. ఉద్యోగులు పాల్గొన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదు చేస్తే స్థానిక అధికారులు ఎన్నికల అధికారులకు నివేదిస్తారు. నిర్ధారణ అయితే సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేస్తారు.

నిబంధనలు ఇలా..

- ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు.
- కిందిస్థాయి సిబ్బంది, ఇతరులను ఫలానా పార్టీకే ఓటు వేయాలని ఆదేశించకూడదు.
- ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు.
- రాజకీయ పార్టీల కండువాలు వేసుకొని ప్రచారం చేయరాదు.
- సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు.

సామాజిక మాధ్యమాలపై దృష్టి..

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేక మీడియా మానిటరింగ్ బందాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ట్విటర్‌లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా, ప్రతికూలంగా పోస్టులు చేస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది. కేవలం చూడటం వరకు పరిమితం కావొచ్చు. సోషల్ మీడియా ఖాతాలపై ఈసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగులను మొదట విధుల నుంచి తప్పించి, తర్వాత విచారణ చేస్తారు.

ముంబయిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



మద్దూరు: కొడంగల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ముంబయిలోని ములుండ్, అల్లీభాగ్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడి నుంచి ముంబాయికి వలస వెళ్లి, అక్కడే స్థిరపడిన వారిని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, చంద్రశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, అనంత్‌రెడ్డిలు కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. నవంబర్ 30న నియోజకవర్గానికి వచ్చి ఓటు వేయాలని సూచించారు. వీరి వెంట రాములు, గోవిందు ఉన్నారు.

టీషర్ట్స్ సీజ్

పాలమూరు: మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు శనివారం హౌసింగ్‌బోర్డు శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. హరిశ్చంద్ర అనే వ్యక్తి తన కారులో హైదరాబాద్ నుంచి పరిగి నియోజకవర్గానికి ఓ పార్టీ అభ్యర్థి ఫొటోతో కూడిన 200 టీషర్ట్‌లను కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. టీషర్ట్స్‌పై రెడ్డిపల్లి యువసేన, జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్, టి.రామ్మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని ముద్రించి ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు రూ.60వేల విలువజేసే టీషర్ట్స్‌తో పాటు కారు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అసెంబ్లీ అభ్యర్థులు వంగూర్ మండలవాసులే..



రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు



యశశ్వినిరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి

కల్వకుర్తి: కల్వకుర్తి ప్రాంతం రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన నియోజకవర్గం. ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది నాయకులు రాష్ట్ర, కేంద్రంలో మంత్రి పదవులు పొందారు. ప్రస్తుతం నియోజకవర్గం నుంచి మరో ఇద్దరు నాయకులు ఇతర ప్రాంతాల్లో అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీకి సిద్ధమయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్‌లో పోటీ చేయనున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వంగూర్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామవాసి. ఇతను ఇక్కడి నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి.. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ జెడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, రెండు సార్లు కొడంగల్ ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా ఉన్నారు. అదేవిధంగా పాలకుర్తి నుంచి పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి యశశ్వినిరెడ్డి.. వంగూర్ మండలం డిండిచింతపల్లికి చెందిన మాధవి–తిరుపతిరెడ్డిల కూతురు. ఆమె వివాహం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌కి చెందిన రాజారామ్మోహన్‌తో జరిగింది. పెళ్లయ్యాక అమెరికాలో స్థిరపడ్డ ఆమె.. కొద్ది రోజుల తర్వాత హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. నాటి నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ చివరకు పాలకుర్తి సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. ఈ ప్రాంతం వారు రాజకీయంగా రాణిస్తూ ప్రజలకు సేవలు అందిస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగదు పట్టివేత

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.4.69 లక్షలు సీజ్

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.3లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. అమరచింత మండలం నాగల్ కద్మూరు చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షలు, వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల హన్మాన్ టెంపుల్ సమీపంలో రూ.లక్ష నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు పెద్దమందడి, వనపర్తి మండలాల్లో 44 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు.



అమరచింత మండలం నాగల్ కద్మూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ



వనపర్తి మండలం చిట్యాల శివారులో పట్టుబడిన నగదుతో పోలీసులు

ఊర్కొండ: మండలంలోని ముచ్చర్లపల్లి గేట్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద రూ.79వేల నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. రమావత్ రాము అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.79వేల నగదు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని పిరట్వానిపల్లి స్టేజీ వద్ద రూ.90వేలు నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. నల్గొండ జిల్లా చందంపేట మండలం కాట్రావత్ తండాకు చెందిన హర్యానాయక్ బైక్‌పై నగదు తరలిస్తుండగా, పట్టుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

అంబటిపై దాడి ఘటనలో కేసులు నమోదు

- నిందితులైన ఏడుగురు టీడీపీ నేతల గుర్తింపు
- ఘటనను ఖండించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం క్రైం: ఖమ్మంలో శుక్రవారం ఏపీ మంత్రి అంబటి రాంబాబు కాన్వాయ్‌ను అడ్డుకుని కర్రలతో బీభత్సం సృష్టించిన టీడీపీ నాయకులు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్‌కుమార్, రామాంజనేయ, జయ, నర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మణ్‌రావు, మందడపు కోటిపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటనపై మంత్రి గన్‌మేన్ జంగం కిరణ్ ఫిర్యాదు మేరకు శనివారం నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. కాగా, శుభకార్యానికి వచ్చిన అతిథులను అగౌరవపరచడం, దాడులకు ప్రయత్నించడం సంప్రదాయం కాదని, ఏపీ మంత్రి అంబటిని దుర్భాషలాడుతూ దాడికి యత్నించడం గర్హనీయమని మున్నూరుకాపు సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీలో తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొన్నాళ్లుగా వాతావరణం పొడిగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల ఉక్కపోత ఉంటోంది. తాజాగా గాలుల దిశ మారిన కారణంగా తూర్పు, ఆగ్నేయ గాలులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి జల్లులు లేదా వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణశాఖ శనివారం ఓ నివేదికలో తెలిపింది. రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల జల్లులు గాని, తేలికపాటి వర్షం గాని కురవవచ్చని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులకు ఆస్కారం ఉందని అంచనా వేసింది.





వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన జనసందోహం ● విశాఖ జిల్లా తగరపువలస సభలో పాల్గొన్న అశేష జనవాహిని

సామాజిక విప్లవ సారథి జగన్‌కు జేజేలు

- మూడో రోజూ ప్రభంజనంలా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- భీమిలి, బాపట్ల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో యాత్రకు విశేష స్పందన
- రేపు పాడేరు, దెందులూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, బాపట్ల/సాక్షి, కడప: సామాజిక విప్లవ సారథి వైఎస్ జగన్ పరిపాలనకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను హర్షాతిరేకాలతో స్వాగతిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. జగనే రావాలి.. జగనే కావాలి' అంటూ అన్ని వర్గాలూ ఒక్క గళమై నినదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మూడో రోజు శనివారం ప్రజలు నీరాజనం పలికారు. గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు చేస్తున్న మంచిని వివరించడానికి సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం విశాఖ జిల్లా భీమిలి, బాపట్ల జిల్లా బాపట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. ఈ బస్సు యాత్ర సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, ఏలూరు జిల్లా దెందులూరు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గాల్లో జరగనుంది.

జగనే కావాలి అంటూ హోరెత్తిన భీమిలి

భీమిలిలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనందపురం మండలం బోయిపాలెం కూడలి నుంచి 2 వేలకు పైగా బైక్‌లు, వందకు పైగా కార్లతో ర్యాలీగా యాత్ర ప్రారంభమై జాతీయ రహదారి మీదుగా తగరపువలస చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద గల బహిరంగ సభ స్థలి వద్దకు చేరింది. పర్యటన ఆసాంతం 'జగనే కావాలి – జగనే రావాలి'అంటూ ప్రజలు చేసిన నినాదాలతో హోరెత్తింది.

బాపట్లలో అపూర్వ స్పందన

బాపట్ల నియోజకవర్గంలో బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. యాత్రకు ప్రజలు పూల తివాచీలతో ఘనస్వాగతం పలికారు. విద్య, వైద్యం తదితర విభాగాల్లో జరిగిన అభివృద్ధిని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల చేరుకుంది. నియోజకవర్గంలోని యువకులు అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో సభ జరిగింది. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చేస్తున్న మేలును మంత్రులు వివరించిన సమయంలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జనసంద్రంగా మారిన పసిడిపురి

పసిడిపురి ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర జనజాతరలా సాగింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నియోజకవర్గ నేతలతో కలిసి బస్సు ముందు నడుస్తుండగా మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలతో స్వాగతం పలికారు. యువత భారీ బైక్ ర్యాలీ చేశారు. శివాలయం సెంటర్‌లో అసంఖ్యాక జనం మధ్య బహిరంగ సభ జరిగింది. దసరా ఉత్సవాలకు పసిడిపురి పెట్టింది పేరు. భారీ స్థాయిలో ప్రజానీకం వీటిని వీక్షిస్తుంటారు. శనివారం సామాజిక సాధికార యాత్ర కూడా ఇదే ఉత్సవాలను తలపించింది.

సిటీ ఆఫ్ డెస్టినీ.. విశాఖ

- అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్థలు, పరిశ్రమలకు నగరం నిలయం
- ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్

సాక్షి, విశాఖపట్నం: అత్యంత ప్రభావవంతమైన విద్యాసంస్థలు, పరిశ్రమలతోపాటు ఆకర్షణీయమైన బీచ్‌లు ఉన్న విశాఖ నగరం నిజంగా 'సిటీ ఆఫ్ డెస్టినీ'అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ముఖ్యంగా హైటెక్ వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మరింత పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన నిపుణులు రాష్ట్రంలో ఉన్నారని ప్రశంసించారు. ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ శనివారం విశాఖ చేరుకున్నారు. ముందుగా ఐఎన్ఎస్ డేగాలో తూర్పు నౌకాదళం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా వైద్య కళాశాలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ని గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న క్లినికల్ అండ్ బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు జగదీప్ ధన్‌ఖడ్ శంకుస్థాపన చేసి.. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్సవాల సదస్సులో పాల్గొన్నారు. ఏఎంసీ సెంటినరీ కాఫీ బుక్, పోస్టల్ కవర్, స్టాంప్‌ని ఆవిష్కరించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు సీజే



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రసాదాలు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

టీటీడీ డైరీలు, కేలండర్ల విక్రయం

తిరుమల: టీటీడీ ముద్రించిన 2024వ సంవత్సరం డైరీలు, కేలండర్లను తిరుమల, తిరుపతిల్లోని అన్ని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో విక్రయిస్తున్నారు. ttdevasthanams.ap.gov. in లో కేలండర్లు, డైరీలు, టేబుల్ టాప్ కేలండర్లను కొనుగోలు చేయవచ్చు. 12 పేజీల కేలండర్ రూ.130, డైరీ (డీలక్స్) రూ.150, డైరీ (చిన్నది) రూ.120, టేబుల్ టాప్ కేలండర్ రూ.75, ఆరు పేజీల కేలండర్ రూ.450, శ్రీవారిపెద్ద కేలండర్ రూ.20, శ్రీవారు, శ్రీ పద్మావతి అమ్మవారి కేలండర్ రూ.15, శ్రీ పద్మావతి పెద్ద కేలండర్ రూ.20, తెలుగు పంచాంగం కేలండర్ రూ.30గా ధరను టీటీడీ నిర్ణయించింది. చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖల్లోని శ్రీవారి ఆలయాలు, ముంబై, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలుల్లోని టీటీడీ కల్యాణమండపాల్లో కేలండర్లు, డైరీలు విక్రయాల కోసం అందుబాటులో టీటీడీ ఉంచింది.

విజయవాడలోనూ పాస్‌పోర్ట్ ప్రింటింగ్

- జనవరి నుంచి నూతన ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం
- విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష



సాక్షి, అమరావతి: 2024 జనవరి నుంచి విజయవాడలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పాస్ట్‌పోర్ట్ అధికారి శివహర్ష వెల్లడించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ(ఆర్‌పీవో) అధికారులతో శనివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం సేవా కేంద్రంగా ఉందని.. గవర్నర్‌పేటలోని ఏజీ ఆఫీస్ కాంప్లెక్స్‌లో వచ్చే జనవరి నుంచి ప్రారంభించే కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం విస్తృత సేవలు అందించనుందని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలోనే పాస్‌పోర్ట్ ప్రింటింగ్ సౌలభ్యం ఉందని, ఇకపై విజయవాడ నూతన కార్యాలయంలోనూ ఈ సేవలు అందుబాటులోకొస్తాయన్నారు. పాస్‌పోర్ట్ ప్రింటింగ్, డిస్పాచ్‌తో పాటు అడ్మినిస్ట్రేషన్(పరిపాలన), పాలసీ సంబంధిత సేవలనూ విజయవాడ కార్యాలయం అందిస్తుందని తెలిపారు. ఏపీలోని 15 జిల్లాలకు చెందిన పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు విజయవాడ, తిరుపతి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు(పీఎస్‌కే), 13 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) ద్వారా సేవలందిస్తున్నామని, మిగతా జిల్లాలకు విశాఖ ప్రాంతీయ కార్యాలయం సేవలందిస్తుందని చెప్పారు. గతంలో పాస్‌పోర్ట్ స్లాట్ బుకింగ్‌కు నెల పట్టేదని, ప్రస్తుతం ఐదు నుంచి 12 రోజులే పడుతోందన్నారు. విజయవాడ కార్యాలయ పరిధిలో రోజుకు 2 వేల పాస్‌పోర్ట్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. పాస్ట్‌పోర్ట్ సేవల వినియోగానికి అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని, నకిలీ వెబ్‌సైట్‌లు, ఏజెంట్లను నమ్మొద్దని కోరారు.

గుప్తనిధుల తవ్వకాలు

- పోలీసుల అదుపులో నలుగురు.. పరారీలో మరో నలుగురు



మహమ్మదాబాద్: గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా సమీప పొలాల రైతులకు నలుగురు పట్టుబడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మొకర్లబాద్ ముందలి తండా–లింగాయపల్లి మధ్య పొలాల్లో ఉన్న మైసమ్మ ఆలయం దగ్గర శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేసి తవ్వకాలు చేపట్టారు. సమీప పొలాల రైతులు గుర్తించి వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి వెళ్లి ఎవరని ప్రశ్నించగా అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఇద్దరు బైకులతో, మరో ఇద్దరు పొలాల వెంట వెళ్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో మహ్మదాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఉండగా.. మిగిలిన వారు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. మొత్తం 8 మందిలో నలుగురు పట్టుబడగా.. మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ సురేష్ వద్ద ప్రస్తావించగా.. గుప్తనిధుల తవ్వకాలకు వచ్చిన నలుగురు పట్టుబడ్డారని.. మిగిలిన వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు వివరించారు.

చంద్ర గ్రహణం.. ఆలయాల మూసివేత



అలంపూర్ ఆలయానికి తాళం వేస్తున్న ఈఓ, చైర్మన్, అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్: చంద్ర గ్రహణం నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 8 వరకు మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసి ఉంచారు. అర్చకులు సాయంత్రం ఆలయ ద్వారాలు మూసివేసి బంధనం చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

బీచుపల్లిలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ఆంజనేయస్వామి, కోదండరామస్వామి ఆలయాల గర్భగుడి, ముఖద్వార తలుపులను శనివారం సాయంత్రం ఆలయ సిబ్బంది, అర్చకులు మూసివేశారు. చంద్ర గ్రహణం పూర్తయిన అనంతరం ఆదివారం ఉదయం ఆయా ఆలయాలను కృష్ణా జలాలతో శుద్ధిచేసి తిరిగి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

అలంపూర్ ఆలయాలు..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శనివారం సాయంత్రం 5 గంటలకు హారతిచ్చి మూసివేశారు. ఈ సందర్భంగా ప్రధాన దేవతామూర్తుల విగ్రహాలపై దర్భను పవిత్రంగా చేసి ఉంచారు. ఉభయ ఆలయాలకు ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, దేవదాయశాఖ సూపరింటెండెంట్ రఘునాథ్, పాలెం దేవస్థానం ఈఓ రంగారావు తాళం వేసి అర్చకులకు అందజేశారు. అదేవిధంగా రాజగోపురానికి కూడా తాళం వేసి భక్తులను బయటకు పంపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు భక్తులు ఆలయ ప్రాంగణంలో బస చేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయాలు తెరిచి శుద్ధిచేసి మహా సంప్రోక్షణ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాల అనంతరం 9 గంటల నుంచి భక్తులను దర్శనం, ఆర్జిత సేవలకు అనుమతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు జల్లాపురం వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ముఖ్య అర్చకుడు ఆనంద్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్యాచారి, చంద్రయ్యాచారి, రికార్డు అసిస్టెంట్ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

పీయూలో కబడ్డీ జట్టు ఎంపికలు



పీయూలో ఎంపికలకు హాజరైన విద్యార్థులతో పీడీలు తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సౌత్ జోన్ పోటీలకు కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీయూ వైస్‌చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పూర్తిస్థాయి ప్రతిభ ఉన్న వ్యక్తులను మాత్రమే ఎంపిక చేయాలని, పైరవీలు జరగకుండా చూస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన జట్లకు పీయూలో వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అనంతరం కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, కురుమూర్తి, బాల్‌రాజయ్య, మేరిపుష్ప, శ్రీనివాసులు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 1,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 1,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని వివరించారు. ఆవిరి రూపంలో 121 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 2,622 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.539 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలియజేశారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటినిల్వ

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,021 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాలకు 900, కుడి కాల్వకు 15, ఎడమ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

గారాబంగా పెంచితే.. ప్రాణం తీశాడు

- కల్వకుర్తిలో తల్లిని హత్యచేసిన కుమారుడు
- మద్యం మత్తులో ఘాతుకం



ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు

కల్వకుర్తి: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన తన కుమారుడిని అల్లారుముద్దుగా పెంచితే అతనే తన పాలిట మృత్యువుగా మారాడు. తాగిన మైకంలో కన్నకుమారుడు తన కన్నతల్లిని హతమార్చాడు. తల్లి గొంతునులిమి చంపిన తర్వాత అతనే నిర్భయంగా డయల్ 100కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పాడు. కన్నతల్లిని కుమారుడే కిరాతకంగా హతమార్చిన అమానుష సంఘటన కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో చోటుచేసుకుంది. కల్వకుర్తి సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసముండే బంగారమ్మ(48) 15ఏళ్ల కిందటే తన భర్తను కోల్పోయింది. చిన్నవయసులో ఉన్న కుమారుడు రమేష్‌ను 20 ఏళ్లుగా గారాబంగా పెంచింది. ఇళ్లలో కూలి పనులు చేస్తూ.. కుమారుడిని పెంచింది. కుమారుడు పెద్దయ్యాక అతను సైతం కూలి పనులకు వెళ్లేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ ఉండేవాడు. కూలికి వెళ్లగా.. వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తే భవిష్యత్ ఏంటని తల్లి కుమారుడిని నిత్యం మందలించేంది. మందలించిన ప్రతిసారి కుమారుడు తల్లితో నిత్యం గొడవ పడుతూ ఉండేవాడు. ఎప్పటిలాగానే బంగారమ్మ ఉదయాన్నే లేచి ఇళ్లలో కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగివచ్చింది. ఆ సమయంలో కుమారుడిని మందలించగా.. ఇద్దరి మధ్య గొడవ పెరిగింది. ఇద్దరి మధ్య పెరిగిన గొడవ కాస్త తల్లిని హత్యచేసే వరకు వచ్చింది. గొడవ జరుగుతున్న సమయంలో తల్లి కుమారుడిని ప్రతిఘటించలేకపోవటంతో, రమేష్ తన నడుముకు ఉన్న మొలతాడుతో గొంతుకు కట్టి కిందకు పడేసి, తలను భూమికి కొట్టాడు. దీంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందింది. తల్లి మృతిచెందాక కుమారుడే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సీఐతో పాటుగా, ఎస్‌ఐ రమేష్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్య చేసిన కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని హత్యకు గల కారణాలను విచారించారు. ఘటనపై అందిన ఫిర్యాదుతో విచారణ జరుపుతామని కల్వకుర్తి సీఐ ఆంజనేయులు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- న్యాయం చేయాలని సబ్‌స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా



గోపిసింగ్ నాయక్(ఫైల్)

నవాబుపేట: పొలం పక్కన ఉన్న దారిలో విద్యుత్ తీగలు కింద పడి ఉండటంతో ప్రమాదవశాత్తు రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బట్టోనిపల్లితండాలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బట్టోనిపల్లితండాకు చెందిన గోపిసింగ్ నాయక్(48) శనివారం పొలం పక్కన ఉన్న దారిలో వెళ్తుండగా.. విద్యుత్ వైర్లు తెగి దారికి అడ్డంగా పడిపోయాయి. అవి గమనించని రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పడి మృతిచెందాడు. పొలం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు ప్రమాదభరితంగా ఉన్నట్లు రైతులు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. వారు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. వారి నిర్లక్ష్యం కారణంగానే రైతు బలైపోయినట్లు ఆరోపించారు.

గ్రామస్తుల నిరసన..

రైతు కుటుంబాన్ని ఆదుకుని, రైతు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బట్టోనిపల్లి, కొల్లూర్ గ్రామస్తులు కొల్లూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నవాబుపేట ఎస్‌ఐ పురుషోత్తం గ్రామస్తులకు నచ్చజెప్పి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని గ్రామస్తులకు సంబంధిత అధికారుల ద్వార హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

■ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా పడటంతో విద్యుదాఘాతానికి గురై తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య విస్లవత్ మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలియజేశారు.



కొల్లూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

కర్ణాటక రైతులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు



కర్ణాటక రైతులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

దామరగిద్ద: బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా శాసనసభ ఎన్నికల ప్రచారానికి కర్ణాటక రైతులు వచ్చారని తెలుసుకొని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి సమక్షంలో నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలోని భవాని ఆలయ సమీపంలో వారి వాహనాన్ని అడ్డుకున్నారు. అందరినీ ఆలయ ఆవరణలోకి తీసుకెళ్లి ఏ పనిమీద వచ్చారని ఆరా తీశారు. కాంగ్రెస్‌పార్టీ కర్ణాటకలో అమలు చేస్తున్న పథకాలపై తెలంగాణలో బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ఈదప్ప కల్పించుకొని సముదాయించడంతో వదిలిపెట్టారు. అడ్డుకున్న వారిలో కాంగ్రెస్ నాయకుడు ఖాజా, ఎంపీటీసీ సభ్యుడు బస్వరాజ్, శ్రీనివాస్, రఘు, ఆనంద్, వెంకటప్ప, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.